# వర్సిటీలు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు సాధించాలి

● ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

హైదరాబాద్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వర్సిటీలు నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) జాతీయ ర్యాంకులు సాధించాలని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. ఎన్ఐఆర్ఎఫ్‌పై బుధవారం హైదరాబాద్‌లో వర్క్‌షాప్ జరిగింది. రాష్ట్రంలోని 16వర్సిటీల నుంచి 50మంది ఎన్ఐఆర్ఎఫ్ కో-ఆర్డినేటర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని వర్సిటీలు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు సాధనలో ముందుంటున్నాయన్నారు. పరిశోధనల అనంతరం పేటెంట్లు సాధించడం, వివిధ ప్రాజెక్టులకు నిధులు పొందితే వర్సిటీల అకడమిక్ ప్రతిష్ఠ మెరుగుపడుతుందన్నారు. తెలంగాణ ఉన్నత విద్యలో దీర్ఘకాలిక, వ్యూహాత్మక అభివృద్ధికి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ పనికొస్తుందన్నారు. కార్యక్రమంలో మండలి వైస్‌చైర్మన్-1 పురుషోత్తం, వైస్‌చైర్మన్-2 ఎస్.కె. మహమూద్‌తో పాటు వర్సిటీల ప్రతినిధులు హాజరయ్యారు.

# విద్యార్థులకు ఉపకార వేతనాల అందజేత

కూకట్‌పల్లి, న్యూస్ టుడే: జేఎన్‌టీయూ విద్యార్థులు ఐదుగురికి బుధవారం వీసీ డాక్టర్ టి. కిషన్‌కుమార్‌రెడ్డి ఉపకార వేతనాలు అందజేశారు. కళాశాల పూర్వ విద్యార్థి పి.రామకృష్ణ ఆధ్వర్యంలో అట్లూరి మోహన్‌దాస్ మాస్టారు స్మారక స్కాలర్‌షిప్ పేరుతో ప్రతిభ చూపుతున్న పేద విద్యార్థులు ఎంఎస్సీ చదువుతున్న రాజశేఖర్, బీటెక్ విద్యార్థులు నరేష్, ధనేష్‌కుమార్, విష్ణు, అఖిలకు ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున రూ.లక్ష నగదు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రఘురాం, వర్సిటీ అలుమ్ని డైరెక్టర్ డాక్టర్ పి.భ్రమర తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో వీసీ టీకేకే రెడ్డి



# పేద విద్యార్థులకు ఆర్థిక బాసట

**జేఎన్టీయూహెచ్ పూర్వ విద్యార్థి విరాళం**
**రూ. లక్ష సాయం.. ఐదుగురికి అందజేత**

కేపీహెచ్బీకాలనీ, మనం న్యూస్: ఉన్నత చదువులు చదువుతున్న పేద విద్యార్థులకు ఆర్థికంగా అండగా నిలవడం అభినందనీయమని జేఎన్టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ టి.కిషన్కుమార్ రెడ్డి అన్నారు. వర్సిటీకి చెందిన మెకానికల్ ఇంజనీరింగ్ (1993 బ్యాచ్) పూర్వ విద్యార్థి పి.రామకృష్ణ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల కోసం రూ. లక్ష విరాళం అందించారు. ఈ మొత్తాన్ని బుధవారం ఐదుగురు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిషన్కుమార్ రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తమ కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తోడ్పాటునందించడం గొప్ప విషయమన్నారు. 'అట్లూరి మోహన్దాస్ మాస్టారు స్మారక స్కాలర్షిప్' పేరుతో ఒక్కొక్కరికి రూ. 20 వేల చొప్పున ఐదుగురు విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. ఎం.ఎస్సీ మ్యాథమెటిక్స్ విద్యార్థి యు.రాజశేఖర్, బీటెక్ విద్యార్థులు బి.నరేష్, పి.ధనేష్ కుమార్, జి.విష్ణు, వి.అఖిల ఈ ఉపకార వేతనాలు అందుకున్నారు. పేద విద్యార్థులను ప్రోత్సహించాలన్న రామకృష్ణ నిబద్ధతను వీసీ కొనియాడారు. కార్యక్రమంలో డీఏఎల్ఏ డైరెక్టర్ పి.భ్రమర, యూసీఈఎస్టీహెచ్ వైస్ ప్రిన్సిపాల్ ఎ.రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.